నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఆదిలాబాద్
మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్
సోమవారం 02 మార్చి 2026 పేజీలు 03





# పేదలకు దక్కని ఆసరా ఫించన్లు






## - మంజూరు క్షణంలోనే 'హెవీ ల్యాండ్' పేరిట కట్!

**చింతలమానేపల్లి, సూర్య మేజర్ న్యూస్**

పేదలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు అండగా నిలవాల్సిన ఆసరా పింఛన్ పథకం నేడు ఐడీల గందరగోళం, అక్రమ మంజూరులు, అకస్మాత్తు కట్‌లతో తీవ్ర వివాదంగా మారింది. సదరం సర్టిఫికెట్లు, ఓల్డేజ్, వితంతు పింఛన్ ఐడీలు వరుసగా జారీ అవుతున్నా---పింఛన్ అమల్లోకి రాకముందే లేదా మంజూరైన మరుక్షణమే నిలిపివేయడం అనుమానాలకు తావిస్తోంది.

### ఐడి ఉంది... పింఛన్ లేదు!

అన్ని ధృవపత్రాలు పూర్తి చేసి, పింఛన్ ఐడి నంబర్ కేటాయించినా "హెవీ ల్యాండ్ ఉంది" అనే ఒకే కారణంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు కట్". అయితే---అర్హత లేకపోతే ఐడీలు ఎలా మంజూరయ్యాయి? ఇది నిర్లక్ష్యమా? లేక ఉద్దేశపూర్వకమా? అన్న ప్రశ్నలు ఊపందుకున్నాయి.

### ఒక్క వ్యక్తికి రెండేసి ఐడీలు!

కొన్ని ప్రాంతాల్లో ఒకే వ్యక్తికి సదరం సర్టిఫికెట్ ఓల్డేజ్ పింఛన్ ఐడీలు, కానీ రూపాయి మాత్రం జీరో. ఒకే కుటుంబంలో భార్య భర్తలు ఇద్దరికీ ఓల్డ్ ఏజ్ పింఛన్లు, భర్త బ్రతికుండగానే భార్యకు వితంతువు పింఛన్లు వస్తున్నాయి. ఇది సిస్టం లోపమా? లేక తెలిసీ అనుమతించిన అక్రమమా? అనే సందేహాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

వెరిఫికేషన్ ఎక్కడ? నిఘా ఎక్కడ?

సదరం,పింఛన్ ఐడీలు క్షేత్రస్థాయిలో జారీ అవుతున్నా భూ రికార్డుల పరిశీలన,కుటుంబ వివరాల ధృవీకరణ ఫీల్డ్ వెరిఫికేషన్ అన్నీ గాలిలో కలిసిపోయాయనే విమర్శలు. ఈ ఐడీలు ఎవరి సిఫారసులతో మంజూరయ్యాయి? బాధ్యత ఎవరిది? 'హెవీ ల్యాండ్' నెపంతో అకస్మాత్తు కట్ ఐడి వచ్చిన వెంటనే---హెవీ ల్యాండ్ ఉందంటూ పింఛన్ బంద్!

ఆ భూమి నిజంగా లబ్ధిదారులదేనా?

పాత రికార్డులు, తప్పు ఎంట్రీల వల్ల పేదలే బలవుతున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి.

### బాధితుల హృదయ విదారక వేదన వికలాంగ లబ్ధిదారు

"సదరం కార్డు ఇచ్చారు... పింఛన్ ఐడీ కూడా ఇచ్చారు. కానీ రూపాయి చేతికి రాకముందే పింఛన్ బంద్ చేశారు." వితంతు బాధితురాలు: "భర్త చనిపోయిన వెంటనే అన్ని సర్టిఫికెట్లు ఇచ్చాం. ఐడీ వచ్చింది... కానీ పింఛన్ రాలేదు. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి? ఎవర్ని అడగాలి?"



సంపూర్ణ విచారణకు డిమాండ్

ఐడీల మంజూరు నుంచి పింఛన్ల కట్ వరకూ సమగ్ర విచారణ జరపాలి

అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నిజమైన లబ్ధిదారులకు తక్షణమే పింఛన్లు పునరుద్ధరించాలి అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆసరా పథకం పేదలకు ఆదరణగా ఉండాలా? లేక 'ఐడి మాఫియా'కి ఆదాయ వనరుగా మారాలా?

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ పింఛన్ గందరగోళానికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### ఎంపీడీవో వివరణ

ఈ అంశంపై ఎంపీడీవో సుధాకర్ రెడ్డి స్పందిస్తూ "బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 7 ఎకరాలకు పైగా భూమి ఉన్నవారు, కుటుంబంలో ఫోర్ వీలర్ ఉన్నవారి పింఛన్లు కట్ చేశారు. అప్పటి నుంచి ఆ కట్ అయిన పింఛన్లకు సైట్ ఓపెన్ కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేస్తే, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

విద్యాభ్యాసానికి, విద్యార్థుల సంక్షేమానిక

# అత్యంత ప్రాధాన్యత

**- విద్యార్థులకు నిరంతర భోజన సరఫరా, శుద్ధమైన త్రాగునీరు, వసతి, వంటశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు**

**- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి**

**మంచిర్యాల,మార్చి 1, సూర్య మేజర్ న్యూస్ :**

సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం, విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాలుర సమీకృత వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో ఆదివారం వసతి గృహాన్ని సందర్శించి




విద్యార్థులతో మాట్లాడి భోజన సరఫరా, త్రాగునీరు, వసతి, వంటశాల ఏర్పాట్లను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి మాట్లాడుతూ వసతి గృహంపై వెలువడిన వార్తల నేపథ్యంలో వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించడం జరిగిందని, హాస్టల్ స్థాయిలో పర్యవేక్షణ, సమన్వయంలో తాత్కాలిక లోపం కారణంగా భోజన సరఫరా, కొంతమంది ప్రాథమిక సౌకర్యాలలో అంతరాయం ఏర్పడినట్లు గమనించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టడం జరిగిందని, విద్యార్థులకు నిరంతర భోజన సరఫరా, శుద్ధమైన త్రాగునీరు, వసతి, వంటశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం వసతి గృహంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బందిని కఠినంగా హెచ్చరించడం జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ రోజు జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## వైభవంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం

**రామకృష్ణాపూర్ మార్చి 01, సూర్య మేజర్ న్యూస్**

రామకృష్ణాపూర్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలోని కనకదుర్గ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం అధికారులు వైభవంగా నిర్వహించారు. ఏరియా జిఎం రాధాకృష్ణ వార్షికోత్సవం సందర్భంగా పూజలో పాల్గొని హోమయజ్ఞాలను చేశారు. కార్మికులు, వారి కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని జిఎం ఆకాక్షించారు. అమ్మవారి దీవెనలు పట్టణ ప్రజలపై ఉండాలని వేడుకొన్నారు. ఆలయ విశిష్టతను వేద పండితులు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వార్షికోత్సవంలో సింగరేణి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



రోడ్డు బాగుంది..

## బస్సు నడపండి

**--ఆర్టీసీ అధికారులకు ప్రజల వినతి**

**--పరిశీలించి బస్సు వేస్తాం..!**

**--ఆర్టీసీ డిఎం రాజశేఖర్**

**కాగజ్ నగర్ రూరల్,సూర్య మేజర్ న్యూస్**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఊరికి పల్లె వెలుగు బస్సులు నడపడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతగా పేర్కొంటుంది. సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి అనే నినాదాలు మనం చూస్తూనే ఉంటాం. కానీ సంవత్సరాల పైబడి రోడ్లు బాగున్న కనీసం పల్లె వెలుగు బస్సులు నడిపించని గ్రామాలు ఇంకా ఉన్నాయి అంటే అతిశయోక్తి ఏమాత్రం కాదు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ --సిర్పూర్ టి మండల కేంద్రాల మధ్య ఎన్నో గ్రామాలు ఆర్టీసీ



బస్సు సౌకర్యానికి నోచుకోకుండా ఉన్నాయి. కాగజ్ నగర్ మండలంలోని ఇస్గాం, నజరుల్ నగర్, తో పాటు 13 బెంగాలీ క్యాంపు గ్రామాలు, అనుకోడ, మాండ్వా, కొత్త అనుకోడ, చుంచుపల్లి, చింతకుంట, హీరాపూర్, శివ పూర్, అచ్చెల్లి , పెద్ద బండ మీదుగా సిర్పూర్ టి మండల కేంద్రం వరకు సుమారు 30 కిలోమీటర్ల మేర బి.టి రోడ్ సౌకర్యం ఉంది. కానీ అధికారుల అలసత్వం, ప్రజా నాయకుల పట్టింపు లేని తనం వల్ల ఇప్పటివరకు ఈ గ్రామాలకు కనీసం ఆర్టిసి బస్సు సౌకర్యం లేదు. గతంలో 10 సంవత్సరాల క్రితం ఈ మార్గంలో ఆర్టిసి బస్సును అధికారులు నడిపించారు. కానీ కాల క్రమేణా ఏమైందో ఏమో కానీ.. బస్సును రద్దు చేశారు. కారణాలు మాత్రం తెలియడం లేదు. దీంతో ప్రయాణికులు అధిక డబ్బులు వెచ్చించి , ఆటోల్లో ఇబ్బందికరంగా ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయమై ఆసిఫాబాద్ డిపో మేనేజర్ రాజశేఖర్ ను వివరణ త్వరగా ప్రజల నుంచి విన్నపాలు వస్తే.. ఆర్టీసీ ఉన్నత అధికారులకు సమాచారం నివేదించి ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన ఆదర్శ పాఠశాల విద్యార్థినులు

**మందమర్రి, మార్చి 1, సూర్య మేజర్ న్యూస్.**

పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఆటల పోటీలలో ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినులు కో కో పోటీలలో ద్వితీయ బహుమతి సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మందమర్రి, బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల మండలాలకు చెందిన 10 ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినులు క్రీడల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించే లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు క్రీడల్లో తగిన శిక్షణ అందిస్తూ జిల్లా రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుతు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ తో పాటు పాఠశాల అధ్యాపకులు అభినందించారు.



## స్వామివారి కల్యాణానికి అందరూ ఆహ్వానితులే

**లోకేశ్వరం మండల్ సూర్య మేజర్ న్యూస్**

అడిగిన వరాలను కురిపించే కలియుగ ప్రత్యక్ష దైవం నారాయణ గుట్ట శ్రీ రాజ్యలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామి. ఆయన కళ్యాణ మహోత్సవానికి అందరూ ఆహ్వానితులేనని ఆలయ కమిటీ అర్చకులు నరసింహస్వామి,లు భక్తులకు ఆహ్వానం పలికారు. లోకేశ్వరం మండలం బాగా పూర్ గ్రామం



శివారులో వెలసిన నారాయణగుట్ట శ్రీ రాజ్యలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ నాళం సంతోష్ కుమార్ జోషి బృందం వారి కరకమలములచే ఘనంగా జరుగుతున్నాయి. 2వ రోజు అయినా ఆదివారం శాంతిపాఠం,మండపారాధన,పూజలు హోమాలు,చండీ హోమం, లక్ష్మీనారాయణ వస్త్ర విగ్రహాలు మండప ప్రవేశం,హారతి,ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం, ఏకాంత సేవ,అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృప కటాక్షాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవేద ప్రణీత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## చోర్ పల్లి గ్రామంలో నూతన కరెంట్ పోల్స్ ఏర్పాటు

**సిర్పూర్ యూ మార్చ్ 1 సూర్య మేజర్ న్యూస్**



లింగాపూర్ మండలం చోర్ పల్లి గ్రామంలో సర్పంచ్ మార్సకోలా అనసూయ ఆధ్వర్యంలో ప్రజలకు విద్యుత్ సౌకర్యం కల్పించుటలో భాగంగా ఇండ్ల వద్ద కరెంట్ పోల్ లేని ప్రాంతాలలో కొత్తగా కరెంట్ పోల్స్ ఏర్పాటు చేశారు.సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు విద్యుత్ శాఖ నూతన స్తంభాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తోంది అన్నారు.నివాస ప్రాంతాల్లో విద్యుత్ భద్రత కోసం ఈ చర్యలు చేపట్టి నట్లు తెలిపారు.

## ఎవరైనా బిల్లు లేని సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొన వద్దు.. ఎస్సై విజయ్

**ఉట్నూర్ సూర్య మేజర్ న్యూస్ :** అందారే అనిల్ ఇంద్రవెల్లి అను అతడు ఆత్రం రవీందర్ తండ్రి పేరు కేశవరావు నివాసము దంతాలపల్లి ఇతడీ వద్ద నుండి మొబైల్ మాట్లాడతానని చెప్పి ఇవ్వమని అడిగి మొబైల్ నీ దొంగలించి పారిపోవడం జరిగింది. ఇట్టి వ్యక్తిని మొబైల్ ట్రేస్ చేసి ఉట్నూర్ బస్టాండ్ వద్ద మొబైల్ షాపులో అమ్ముటకు వెళ్తుండగా పట్టుకొని ఉట్నూర్ ఎస్సై విజయ్ కోర్టుకు పంపడం జరిగింది. అందారే ఆనంద్ పై ఇదివరకు మొబైల్ దొంగతనం కేసు కలదు. ఎవరైనా బిల్లు లేని సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొన వద్దని పోలీసు వారు హెచ్చరిస్తున్నారు.



## టీచర్లకు అధిక మొత్తంలో జీతాలు ముడుతున్నాయి అనడం సరికాదు: టిఎస్ యు టిఎఫ్.

**కాగజ్నగర్, మార్చ్ 1, సూర్య మేజర్ న్యూస్:**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండల అధ్యక్షుడు పుల్లూరి బాలకృష్ణ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో టి ఎస్ యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సమర్పించిన విద్యావిధాన పత్రం-2026. సిఫారసుల్లో కొన్ని ప్రభుత్వ విద్యారంగానికి మేలు చేసే విధంగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు సంబంధించిన సిఫారసుల విషయంలో చాలా అభ్యంతరకరంగా ఉన్నాయి. ఇవి ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయి. ఇలాంటి సిఫారసుల విషయంలో విద్యాకమిషన్ చైర్మన్ పునరాలోచించుకోవాలి' అని ఆమె తెలిపారు . ఇతర వృత్తులకంటే ఎక్కువ వేతనాలు ఉండాలని జాతీయ విద్యాకమిషన్(కొఠారి కమిషన్) సూచనలకు విరుద్ధంగా ఈ సిఫారసులు ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల వేతనాలు తగ్గించడం, అప్రెంటిస్ విధానం అమలు చేయడం, రెగ్యులర్ ఉపాధ్యాయులు కాకుండా కాంట్రాక్టు పద్ధతిన ఉపాధ్యాయులు ఉండాలనడం,వంటి సిఫారసులు ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఈ సిఫారసులతో మేలు జరిగేదేమీలేదని తెలిపారు.అలాగే వివిధ గురుకులాలు,కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు మోడల్ స్కూల్ లలో పనిచేసే ఉపాధ్యాయులు శ్రమదోపిడికి గురవుతున్నారని వారికి సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కోరారు. 010 పద్దు కిందలేని వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు.ప్రభుత్వం ఇచ్చే హెల్త్ కార్డులు, వ్యక్తిగత ప్రమాద భీమా ను స్వాగతిస్తున్నాం అదే సమయంలో ఉపాధ్యాయుల నుండి 1000కి మించకుండా కాంట్రిబ్యూషన్ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఇదే సమావేశంలో జిల్లా కార్యదర్శి జుట్టు మహిపాల్ మండల కమిటీ పనితీరు, భవిష్యత్ కర్తవ్యాలు,రాష్ట్ర విద్యారంగ పరిస్థితుల గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పుల్లూరి బాలకృష్ణ ప్రధాన కార్యదర్శి పణితి మహేష్ మండల కార్యదర్శులు సిహెచ్ వేణి, జి రంజిత్ రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ డి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



# క్రికెట్ పోటీలు

## యువతకు స్ఫూర్తిదాయకం

**బెల్లంపల్లి, మార్చి 01, సూర్య మేజర్ న్యూస్:**

జంగపల్లి ఎర్రయ్య స్మారకర్థం బెల్లంపల్లి మండలం దుగినెపల్లి గ్రామంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగపల్లి ఎర్రయ్య స్మరకార్థం క్రికెట్ పోటీలు ఇక్కడ నిర్వహించడం అభినందనీయ మన్నారు. యువకులు గంజాయి ఇతర మత్తు పానీయాలకు అలవాటు కాకుండా అంతర్జాతీయ క్రీడా క్రికెట్ పట్ల ఆసక్తి పెంచుకొని మండల, జిల్లా, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జుమ్మిడి బానయ్య, బట్వాన్ పల్లి సర్పంచ్ సంగతి రాజేష్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోమాస శ్రీకాంత్ లు మాట్లాడారు. 15 రోజుల పాటు ఇక్కడ క్రికెట్ పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. క్రమ శిక్షణతో గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని గెలుపు కోసం పోరాడాలాని పిలుపునిచ్చారు. ఈ పోటీల ఆర్గనైజర్ జంగపల్లి ఎర్రయ్య పెద్ద కుమారుడు జంగపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీలకు 40 జట్లు హాజరయ్యాయని తెలిపారు. నిర్ణీత 10 ఓవర్ల లక్ష్యంతో టాస్ గెలిచి బ్యాటింగ్ పట్టిన నెన్నెల మండలం గొల్లపల్లి జట్టు 76 రన్స్ చేసింది. ఆతర్వాత బ్యాటింగ్ చే పట్టిన పెర్కపల్లి జట్టు 60 రన్స్ కే ఆల్ అవుట్ అయింది. 16 రన్స్ తేడాతో గొల్లపల్లి జట్టు పెర్కపల్లి జట్టు పై గెలుపొందినట్లు తెలిపారు. ఈ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 20 వేల రూపాయల నగదు, రెండో బహుమతి 15000 రూపాయల నగదు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.



## మినరల్ వాటర్ ప్లాంట్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీఐ

**ఆసిఫాబాద్, మార్చి01, సూర్య మేజర్ న్యూస్ :**

ఆసిఫాబాద్ పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్ పై పోలీసులు ఆదివారం



రోజున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉన్న 13 మినరల్ వాటర్ ప్లాంటులను సీఐ బాలాజీ వరప్రసాద్ స్వయంగా సందర్శించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్, ఏ ఎస్పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి వాటర్ ప్లాంట్ లో నాణ్యత ప్రమాణాలు పరిశుభ్రత కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే తప్పనిసరిగా దానికి అవసరమైన లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా లైసెన్స్ లేకుండా ప్లాంట్లు నడిపితే వాటిని సీజ్ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నూతన డ్రైనేజీ పనులు ప్రారంభం

**పెంచికల్ పేట్, మార్చి 1, సూర్య మేజర్ న్యూస్ :**

పెంచికలపేట్ మండలం ఎల్కపల్లి గ్రామపంచాయతీలోని ఎస్సీ కాలనీలో ఏళ్లుగా వేధిస్తున్న మురుగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ భక్తు రామచందర్ ఆదివారం పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పాలకవర్గం ఆమోదంతో వెంటనే పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కాలనీ వాసుల సమస్యలును త్వరగా పరిష్కరించడమే మా లక్ష్యం అని అన్నారు. ఈ చర్యపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో నాయకులు గణపురం నగేష్, జునగారి మధుకర్,రాజన్న, బాపు, వెంకన్న, తులసిరామ్ మరియు లంచు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్‌పర్సన్ పర్యటన

**లక్షెట్టిపేట, మార్చి 01, సూర్య మేజర్ న్యూస్ :** మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ దొంత అంజలి నర్సయ్య ఆదివారం పర్యటించారు. వార్డులోని పలు వీధులను సందర్శించి స్థానిక పరిస్థితులను, పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించారు. వార్డు పర్యటనలో భాగంగా 6వ వార్డు కౌన్సిలర్ తోట సువర్ణ రమేష్ వార్డులో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ కాలువలు, సి.సి. రోడ్లు, వీధి దీపాల సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని విన్నవించారు. విన్నపాలపై సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్ దొంత అంజలి నర్సయ్య మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి తమ పాలకవర్గం కట్టుబడి ఉందని, ప్రాధాన్యత క్రమంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ పదవి చేపట్టిన తర్వాత మొదటిసారి తమ వార్డుకు విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని కౌన్సిలర్ తోట సువర్ణ రమేష్, వార్డు ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మోతుకూరి రాజేశ్వరి వెంకటస్వామి, వార్డు ప్రముఖులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత: ఎఫ్ఆర్వో

**కడెం. సూర్య మేజర్ న్యూస్:**

వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగకుండా ప్రజలు సహకరించాలని కడెం ఎఫ్ఆర్ఓ గీతారాణి, డిఆర్ఓ సిద్ధార్థ కోరారు. ఆదివారం కడెం మండలం పాండవపూర్ గ్రామంలో గ్రామస్తులకు అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ పట్ల గ్రామస్తులకు వివరించి అవగాహన కల్పించారు. ఉద్దేశపూర్వకంగా అటవీ ప్రాంతాల్లో నిప్పు పెట్టిన, వన్యప్రాణులకు హాని కలిగించిన చట్టరీత్య కఠిన చర్యలు ఉంటాయన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖీదీా నూమన్, అటవీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.




## అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సమావేశం

**కాగజ్నగర్, మార్చ్ 1, సూర్య మేజర్ న్యూస్:**

కాగజ్ నగర్ పట్టణంలోని వాసవి మినీ ఫంక్షన్ హాల్ లో అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ రాష్ట్ర కార్యవర్గం మరియు జిల్లా పిఎస్టి ల సమావేశం ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు టీవీ పుల్లం రాజు మాట్లాడుతూ అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో శబరిమలకు అతి సమీపంలో నారాయణతోడ్ వద్ద సంస్థ సొంత అన్నదాన మందిరంలో శబరిమలలో అయ్యప్ప స్వామి ఆలయం తెరిచి ఉన్న ప్రతి రోజు ఇక్కడ అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు, అదేవిధంగా సంస్థ ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు, ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దుశెట్టి భాస్కర్, రాష్ట్ర కోశాధికారి పోతురాజుల రమేష్ , గురుస్వామి ఎనగంటి బిక్షపతి , ఈదులపల్లి జ్యోతిష్, కుంచాల విజయ్ కుమార్, కారం సాయి కృష్ణ,నీలి సతీష్. తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుల నియామకం

**మందమర్రి, మార్చి 1, సూర్య మేజర్ న్యూస్.**

పట్టణ భారతీయ జనతా పార్టీ నూతన పట్టణ ప్రధాన కార్యదర్శిగా శనిగారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గాదే రాములు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాలను పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, సీనియర్ నాయకుడు డివి దీక్షితులు ఆదివారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా శనిగారపు శ్రీనివాస్, గాదే రాములు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే పార్టీ బలోపేతానికి నిరంతరం పని చేస్తామని, బాధ్యతలు అప్పగించిన సీనియర్ నాయకులు దీక్షితులు, పట్టణ అధ్యక్షుడు నరేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మట్కా రాయుళ్ల అరెస్ట్.

**కాగజ్నగర్, మార్చ్ 1, సూర్య మేజర్ న్యూస్:** కాగజ్ నగర్ పట్టణంలోని గాంధీ పార్క్ చౌక్ దగ్గర ఆదివారం కొంతమంది వ్యక్తులు కలిసి నిషేధిత మట్కా ను డబ్బులు బెట్టింగ్ పెట్టుకుని ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పట్టణ ఎస్సై సుధాకర్ మరియు తన సిబ్బందితో కలిసి గాంధీ చౌక్ దగ్గర ఆట స్థావరంపై దాడి చేసి ఆట స్థలం వద్ద అయిదుగురు వ్యక్తులు కలిసి ఒక ఆటోలో కూర్చొని అనుమానం రాకుండా ఆడుచుండగా ఆ ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద 10,400 రూపాయలు నగదు, మట్కా చిట్టీలు, నాలుగు సెల్ ఫోన్లు, ఒక ఆటో మరియు ఒక బైకు పట్టుకొని జప్తు చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది.అదేవిధంగా ఎవరైనా వ్యక్తులు నిషేధిత ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ మట్కా, సట్కా ఆటను బెట్టింగ్ పెట్టుకుని ఆడుచుండగా తగిన సమాచారం ఇచ్చి పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ తెలియజేశారు . నిందితుల వివరాలు. 1. ఎండి ఖాజా, తండ్రి. ఎండి. నన్ను,వృత్తి. ఆటో డ్రైవర్, నివాసం. జగన్నాథ్ పూర్ గ్రామం 2. ఎస్.కె .నవాజ్ తండ్రి. ఎస్.కె .మొయినుద్దీన్ వృత్తి.కూలి, నివాసము. సుభాష్ కాలనీ, 3. కొట్రంగి సంతోష్, తండ్రి.రాజయ్య వృత్తి.కూలి,నివాసం. కౌసర్ నగర్ 4. రెండ్ల అంజయ్య తండ్రి. శంకర్ల పై కేసు నమోదు చేసిన పోలీసులు.



## ఘనంగా శ్రీ బాలాజీ బజరంగ్ మిఠాయి భండార్ & గ్రాండ్ బేకరీ ప్రారంభం

**రామకృష్ణాపూర్ మార్చి 01, సూర్య మేజర్ న్యూస్**

మందమర్రి మార్కెట్ లో అరసవల్లి బాలాజీ ఆధ్వర్యంలో నాలుగు దశాబ్దాలకు పైగా శ్రీ బాలాజీ బజరంగ్ మిఠాయి భండార్ & గ్రాండ్ బేకరీ స్వీట్స్ షాప్ స్థానిక ప్రజలలో ఎంతో పేరుగాంచింది, వ్యాపార విస్తరణలో భాగంగా మొదటి బ్రాంచ్‌గా రామకృష్ణాపూర్‌లోని భగత్ సింగ్ నగర్ శ్రీ గణపతి ఆలయం పక్కన ఏర్పాటు చేయడం జరిగింది. మందమర్రి వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రధాన అర్చకులు అనంతచారి వేద మంత్రోత్సవాల మధ్య ఆదివారం ఉదయం గొప్పగా ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, విప్ నల్లాల ఓదెలు, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కె రాధాకృష్ణ, మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు గాండ్ల సమ్మయ్య, ఎండి అబ్దుల్ అజీజ్, మాజీ వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ కి ఘన సన్మానం

**అసిఫాబాద్, సూర్య మేజర్ న్యూస్ :** అసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ ను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మోయిన్ ఘనంగా సన్మానించారు. ఎండీ అహ్మద్‌కు పూలమాల వేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మోయిన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే పట్టణాలు ఎంతో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని మైనార్టీ ముస్లిం వర్గానికి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు సూఫియాన్ తదితరులు పాల్గొన్నారు.



### చైర్ పర్సన్ స్థానం కోసమే కాంగ్రెస్ కుట్రపూరిత

# రాజకీయాలు చేస్తుంది

### - బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్

**రామకృష్ణాపూర్ మార్చి 01, సూర్య మేజర్ న్యూస్**

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, విప్ బాల్క సుమన్ అరెస్ట్ అప్రజాస్వామికమని పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక కాకుండా అడ్డుకున్న మంత్రి వివేక్ సౌమ్యుడు అనే ముసుగులో అరాచకాలు చేయడం సిగ్గుచేటన్నారు. 22 స్థానాల్లో కేవలం 7 స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ పీఠం దక్కించుకోవాలనే దురుద్దేశ్యంతో ఎన్నిక వాయిదా పడేలా కుట్రలు పన్ని ప్రజాస్వామ్యాన్ని కూని చేశారని మండిపడ్డారు. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారంలో బాగంగా నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కార్యాలయానికి సుమారు యాభై కార్లలో వచ్చి ఘర్షణ వాతావరణాన్ని నెలకొల్పి బాల్క సుమన్, బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించారన్నారు. అధికార దాహంతో కాంగ్రెస్ పార్టీ ఆడిన చదరంగంలో న్యాయమే నెగ్గుతుందని, ప్రజల మద్దతు బిఆర్ఎస్ పార్టీకి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు జాడి శ్రీనివాస్, అనిల్ రావ్, రెవెల్లి ఓదెలు, పారుపెల్లి తిరుపతి, జిలకర మహేష్, గడ్డం రాజు, సతీష్ పాల్గొన్నారు.

### కొత్త ఆలోచనతో

## సర్పంచ్ నా ఊరు - నా బాధ్యత కార్యక్రమం

**కాగజ్ నగర్, మార్చ్ 1, సూర్య మేజర్ న్యూస్:** కన్నెపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మోర్లె పార్వతి కి వచ్చిన సరికొత్త ఆలోచన మేరకు "నా ఊరు -- నా బాధ్యత" అనే సామాజిక సేవా కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ యువత స్వచ్ఛందంగా పాల్గొని,గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో శ్రమదానం చేశారు.ఊరి పొలిమేరలోని పోచమ్మ గుడి పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతో పాటు,రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని కూడా శుభ్రం చేయడం జరిగింది.గ్రామం పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండాలనే లక్ష్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాన్ని ప్రతి నెల రెండుసార్లు - మొదటి ఆదివారం మరియు చివరి ఆదివారం నిర్వహించనున్నట్లు పాల్గొన్న యువత తెలిపారు.ఒకే రకమైన టీ-షర్టులు ధరించి, కలిసికట్టుగా గ్రామాభివృద్ధి దిశగా ముందుకు సాగాలనే సర్పంచ్ ఆలోచనకు మేము నడుము బిగించడం తమకు గర్వకారణమని యువత పేర్కొంటూ,ఈ సేవా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.గ్రామాభివృద్ధికి నడుం బిగించి శ్రమిస్తున్న యువతకు గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.



### నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా

# ఆలయ నిర్మాణం చేయాలి

### - భీమన్న ఆలయం భూమిపూజలో రామారావు పటేల్

**లోకేశ్వరం మండల్ సూర్య మేజర్ న్యూస్**

నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గుత్తేదారుకు సూచించారు. లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య దైవం భీమన్న దేవుని ఆలయ నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు,సంస్కృతి సంప్రదాయాలను విశ్వసిస్తూ తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ సిజిఎఫ్ ద్వారా 25 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు.గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యతోపాటు అన్ని మౌలిక సదుపాయాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగేమ్ లక్ష్మీ నర్సయ్య, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, భాజపా మండల కన్వీనర్ బొడికే సాయన్న,గన్ను వెంకటరెడ్డి,బలరాం,యువకులు,గ్రామస్తులు,మరియు తదితరులు పాల్గొన్నారు.

